ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

'నమస్తే' కథనానికి స్పందన

బండనాగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

బచ్చన్నపేట, ఏప్రిల్ 18 : మండలంలోని బండనాగారం, కేశిరెడ్డిపల్లి, లక్ష్మాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రోజారాణి, జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ పరిశీలించారు. గురువారం నమస్తే తెలంగాణ దినపత్రికలో 'అకాల వర్షం తడిసిన ధాన్యం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. వెంటనే గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. కేంద్రాల వద్ద టార్పాలిన్, తాగునీటి వసతి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. లక్ష్మాపూర్‌లో నిర్ణీత తేమశాతం రానందున ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. తహసీల్దార్ విశాలాక్షి, సివిల్ సప్లయ్ డీటీ శ్రీనివాస్ ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్
- నాయకులు, అధికారులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, ఏఆర్‌వో రోహిత్ సింగ్

పాలకుర్తి రూరల్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అదనపు కలెక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రోహిత్ సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల పాఠశాలలో ఈవీఎంల స్ట్రాంగ్‌రూంలు, భద్రతను సీఐ గట్టు మహేందర్ రెడ్డి, తహసీల్దార్ వెంకటేశంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల గోడలపై ఎన్నికల రాతలు రాయొద్దన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టోరియల్ అధికారులు తదితర బృందాలు ఎన్నికల కోడ్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తారని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. గురువారం నుంచి 25 వరకు ఎంపీ అభ్యర్థుల నామినేషన్లను వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు తెలిపారు. మే 3 నుంచి 8 వరకు దివ్యాంగులు, వృద్ధుల హోం ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. మే 3 నుంచి ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తామని వివరించారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు ఈవీఎంలు స్ట్రాంగ్ రూంకు చేరుకుంటాయన్నారు. సమావేశంలో తహసీల్దార్లు ఆంజయ్య, శ్రీనివాస్, హుస్సేన్, సత్యనారాయణ, డీటీలు ఎం రామారావు, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్సైలు ఎం సాయి ప్రసన్నకుమార్, లింగారెడ్డి, ఎక్సైజ్ సీఐ బీ సంతోష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాచర్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల సామగ్రి పంపిణీ

జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా

ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఎన్నికల సామగ్రిని పకడ్బందీగా పంపిణీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం కార్యాలయంలో భద్రపర్చిన సామగ్రిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల సామగ్రిని వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత సంబంధిత అధికారులు డీసీఎం వాహనంలో ఎన్నికల సామగ్రిని ఆయా నియోజకవర్గ కేంద్రాలకు తరలించారు. కార్యక్రమంలో ఎన్నికల సామగ్రి నోడల్ అధికారి ఆర్ కుమారస్వామి, కలెక్టరేట్ ఏవో రవిందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రావొద్దు

ఖిలాషాపురంలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

రఘునాథపల్లి ఏప్రిల్ 18 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అధికారులకు సూచించారు. మండలంలోని గోవర్ధనగిరి, ఖిలాషాపూర్, కుసుంబాయితండా గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీటి సరఫరా పనులను ఆయన గురువారం పరిశీలించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండాఇప్పటికే రూపొందించిన యాక్షన్ ప్లాన్ ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన పనులను తనిఖీ చేసి, బడ్జెట్ అంచనా వ్యయానికి సంబంధించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అలాగే, ఎస్డీఎఫ్ కింద మంజూరైన మిషన్ భగీరథ పైపులైన్ పనులను పర్యవేక్షించి, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తనిఖీలో డీఈవో రాము, ఎంపీడీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ లక్ష్మీపతి పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగు నీరందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి

కోతులబాదలో దేవాదుల కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పాలకుర్తి రూరల్, ఏప్రిల్ 18 : దేవాదుల ద్వారా ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు ఆధైర్య పడొద్దని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. గురువారం ఉదయం మండలంలోని కోతులబాదలో దేవాదుల 4ఎల్, 5ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాల్వ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సాగు నీరు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. వరద కాల్వలకు ఇరువైపుల ఉన్న ముళ్ల చెట్లను సొంత ఖర్చులతో తొలగిస్తానన్నారు.

ఆగస్టు 15 నాటికి రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కాగా, ఈరవెన్ను గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోతి వెంకన్న ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆమె వెంట నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, జలగం కుమార్, గాగెపాక భాస్కర్, బిర్రు సోమేశ్వర్, కేదారి, వల్లాల రవి, కుమారస్వామి, బక్క పుల్లయ్య, కొమర్రోజు సోమన్న, ముస్కు చంద్రబాబు, బీ భాస్కర్, మహేందర్‌రెడ్డి, స్థానికులు ఉన్నారు.

స.హ. చట్టంతో సామాన్యుడికి గౌరవం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 18 : సమాచార హక్కు చట్టంతో సామాన్యుడికి గౌరవం పెరిగిందని స.హ.చట్టం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని విజయ మినీ వేడుకల మందిరంలో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి, ప్రేమ సేవాసదన్ డైరెక్టర్ మహ్మద్ ఖుర్షీద్ పాషా అధ్యక్షతన 'సమాచార హక్కు చట్టం-2005పై' అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ స.హ.చట్టంతో సమాజంలో జరుగుతున్న అవినీతిని బయటకు తీయడానికి ఆర్టీఐ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గతంలో సామాన్యుల వినతులను అధికారులు పరిగణనలోకి తీసుకునే వారు కాదని, స.హ.చట్టం వచ్చిన తర్వాతే సామాన్యులకు విలువ పెరిగిందన్నారు. ఆర్టీఐ చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. మేధావులు, ఉద్యోగులు, జర్నలిస్టులు ఏకతాటిపైకి వచ్చి ప్రజాస్వామ్యంలో స.హ.చట్టంతో పాటు ఓటు హక్కుపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం సమాచార హక్కు వికాస సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఉండాలంటే ఆర్టీఐను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సమితి ముఖ్య సలహాదారుడు కన్న పరశురాములు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాగిర్థి వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది ఉమాపతి, మాజీ ఎంపీపీ నీలం గోపాల్, జనగామ జిల్లా అధ్యక్షుడు నీలం రవి, ఉపాధ్యక్షుడు శ్రీను, శ్రీకాంత్, నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సాదుల పూర్ణచందర్, శ్రీనివాస్, శ్రీకాంత్, ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రైవేట్ క్లినిక్ సీజ్

సీజ్ చేసిన మందులతో ఔషధ నియంత్రణ అధికారులు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 18 : జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డు మార్గంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ క్లినిక్‌ను గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మితో పాటు జనగామ జిల్లా డ్రగ్ కంట్రోలర్ ఏలె బాలకృష్ణ కలిసి సీజ్ చేశారు. అర్హతలేని వైద్యుడు చిం తకింది యాదగిరిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, క్లినిక్‌లో నిల్వ ఉంచిన సుమారు రూ.45 వేల విలువ చేసే 43 రకాల అల్లోపతి మందులను సీజ్ చేసినట్లు వారు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎం అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి.. డీఎంహెచ్‌వోహరీశ్ రాజ్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఆయూష్ దవాఖానలన్నీ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జనగామ డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్ రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకొని ఉన్న ప్రైవేట్ దవాఖానలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోని దవాఖానల విషయంలో ప్రత్యేక తనిఖీ బృందాల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వచ్చే 15 రోజుల్లో జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడానికి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. ఒక్కో బృందంలో ఐదు నుంచి ఆరుగురు వైద్యారోగ్యశాఖ అధికారులు ఉంటారని ఆయన తెలిపారు.

'కాలువలు కాదు.. కల్లాల వెంట తిరగండి'

దేవరుప్పుల, ఏప్రిల్ 18 : పంటలు చేతికొచ్చి, రోజుల తరబడి ప్రభుత్వ కల్లాల్లో తూకాలు కాక రైతులు అవస్థలు పడుతుంటే పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి కాలువల వెంట తిరుగుతున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అల్లం ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ కాలువల వెంట జనవరి, ఫిబ్రవరి నెలల్లో తిరిగి నీళ్లు తెస్తే పంటలు ఎండేవికావన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే పరిశీలించి రైతులు కష్టాలు తీర్చితే బాగుంటుందని అన్నారు. రైతులు తెచ్చిన పంటలో తేమ శాతం ఎక్కువ ఉందని, తాలు ఉందని, మట్టి ఉందని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సతాయిస్తూ రోజుల తరబడి రైతులు కల్లాల్లో పడిగాపులు కాసేలా చేస్తున్నారని అన్నారు. వారి బాధలు తీర్చాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు. చేరికల్లో చూపే శ్రద్ధ రైతులపై చూపితే బాగుంటుందని ఎమ్మెల్యేకు సూచించారు.

వెంకటాద్రిపేటలో రూ.1.49 లక్షలు సీజ్

చిల్పూరు,ఏప్రిల్ 18 : ఎన్నికల కోడ్ సందర్భంగా పోలీసులు వెంకటాద్రిపేటలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో ఎలాంటి ఆధారాలు లేకుండా వడ్లగూడెం గ్రామానికి చెందిన కస్తూరి వెంకట్రాజం రూ.1.49 లక్షలు తీసుకెళ్తుండగా ఆ డబ్బును సీజ్ చేసి, త్రీమెన్ కమిటీకి అప్పగించినట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ.లక్ష నగదు పట్టివేత

స్టేషన్ ఘన్‌పూర్ : ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మాన్‌సింగ్ తండాకు చెందిన భూక్యా రవీందర్ నాయక్ తన బైక్‌లో రూ.లక్ష నగదు తీసుకెళ్తుండగా దాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ముస్క రాజు తెలిపారు. గురువారం ఆ నగదును స్క్వాడ్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, ఏఎస్సై రాజమౌళి, మగ్దుం పాల్గొన్నారు.

మడేలయ్య గుడికి భూమి పూజ చేస్తున్న రజక సంఘం నాయకులు

మడేలయ్య గుడికి భూమి పూజ

చిల్పూరు, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలోని కొండాపూర్ గ్రామంలో రజక సంఘం నాయకులు గురువారం మడేలయ్య గుడికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామంలోని రజకుల ఇష్ట దైవమైన మడేలయ్య ఆలయాన్ని సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెలిశాల అనిల్, నేరేళ్ల సందీప్, వెలిశాల కనకయ్య, వెలిశాల యాదయ్య, నేరేళ్ల యాదయ్య, వెలిశాల శంకర్, నేరేళ్ల కనకయ్య, బందరపు హరీశ్, నేరేళ్ల రవికుమార్, లోడెం రవీందర్, కొండ తిరుపతి, గుళ్ల ప్రకాశ్, వెంకట్‌రెడ్డి, చొక్కం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌వీఎస్ మండల అధ్యక్షుడిగా నాగరాజు

లింగాలఘనపురం, ఏప్రిల్ 18 : ఎస్‌హెచ్‌వీఎస్(సమాచార హక్కు వికాస సమితి)మండల అధ్యక్షుడిగా లింగాల ఘనపురానికి చెందిన గూటం నాగరాజు ఎన్నికయ్యారు. ఈ మేరకు జనగామలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల మాజీ ప్రధాన సమాచార కమిషనర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వీఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షుడు నీలం స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు తండ్రి కులమే వర్తిస్తుంది'

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 18 : కులాంతర వివాహం చేసుకున్న మహిళకు తండ్రి కులమే వర్తిస్తుందని కులాంతర వివాహ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెసరు సారయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు చిలగాని రాకేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమాశంలో వారు మాట్లాడుతూ ఎలాంటి కట్నానికి ఆశ పడకుండా కులాంతర వివాహం చేసుకుని అన్యోన్యంగా, ఆదర్శంగా జీవిస్తున్న మహిళకు తండ్రి కులమే వర్తిస్తుందని, పిల్లలకు మాత్రమే తండ్రి కులం వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కులాంతర వివాహ మండల అధ్యక్షుడు సముద్రాల రాజు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో ఘనంగా రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న ఈవో, భక్తులు

లింగాలఘనపురం, ఏప్రిల్ 18 : మండలంలోని నవాబుపేట కోదండ రామస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఘనంగా రథోత్సవం చేపట్టారు. ఆలయంలో ఉన్న ఉత్సవ మూర్తులైన రామలక్ష్మణ సీతా హనుమ విగ్రహాలను రథంపైకి చేర్చి, మేళతాళాలతో భక్తులు రథాన్ని తాళ్లతో లాగారు. ఆలయ మాఢవీధులు, అంగడిబజార్, గ్రంథాలయ వీధి, గ్రామ పంచాయతీ కార్యాలయం మీదుగా రథోత్సవం కొనసాగింది. భక్తులు మంగళ హారతులతో ఆహ్వానం పలికి మొక్కులు సమర్పించారు. ఈవో లక్ష్మీప్రసన్న, కుర్రెముల మోహన్, వసంత, పూజారులు లక్ష్మణాచార్యులు, కృష్ణమాచార్యులుపాల్గొన్నారు.

చెక్ పోస్ట్‌ల వద్ద నిరంతరం పనిచేయాలి

సీపీ అంబర్ కిశోర్‌ఝా

కొడకండ్ల : గిర్నితండా వద్ద చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి/పాలకుర్తి/ దేవరుప్పుల, ఏప్రిల్ 18 : ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద నిరంతరం పనిచేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా సిబ్బందిని ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు గురువారం నుంచి చెక్‌పోస్టుల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ జనగామలో చెక్‌పోస్టును తనిఖీ చేశారు. వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించా రు. అలాగే, దేవరుప్పుల, పాలకుర్తి పోలీస్‌స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, స్టేషన్ పనితీరు, శాంతిభద్రతల పర్యవేక్షణ వివరాలను ఇన్‌స్పెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

గిర్నితండా చెక్‌పోస్టులో తనిఖీ

కొడకండ్ల : ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గిర్నితండా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం వాహన తనిఖీల్లో పాల్గొన్నారు. కార్యాక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్‌డే

గ్రాడ్యుయేషన్ వేడుకల్లో చిన్నారులు, సిబ్బంది

దేవరుప్పుల, ఏప్రిల్ 18 : అప్పిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ వేడుకకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి హాజరుకాగా అంగర్‌వాడీ కేంద్రంలో చదువు పూర్తి చేసిన ఐదేళ్ల పిల్లలకు సర్టిఫికెట్లను అందజేశారు. వీరందరినీ ప్రైమరీ పాఠశాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం ఈసీసీఈడే నిర్వహించగా పిల్లల ఆటపాటలు, కథలు చెప్పడం ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నసీరుద్దీన్, అంగన్‌వాడీ టీచర్లు భారతి, ఇందిర, ఆయాలు సైదమ్మ, శివమ్మ, ఆశలు పాల్గొన్నారు.

డీఐఈవోగా ఆంజనేయరాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంజనేయరాజు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 18 : జనగామ జిల్లా ఇంటర్ విద్యా అధికారి (డీఐఈవో)గా కే ఆంజనేయరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత నెల వరకు డీఐఈవోగా విధులు నిర్వర్తించిన బైరి శ్రీనివాస్ ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో ఆంజనేయరాజును నియమించారు. ఈ సందర్భంగా ఆంజనేయరాజును పలువురు ఇంటర్ విద్యా శాఖ ఉద్యోగులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల నోటిఫికేషన్‌ను తహసీల్దార్ కార్యాలయంలో ప్రచురిస్తున్న ఆర్డీవో

ఎన్నికల నోటిఫికేషన్ ప్రచురణ

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నోటిఫికేషన్ పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో డీఎస్ వెంకన్న గురువారం ప్రచురించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయంలో నోటిఫికేషన్‌ను ప్రచురించినట్లు తెలిపారు. తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అర్జున్, రవీందర్ పాల్గొన్నారు.

నేడు కొడకండ్లకు మాజీ మంత్రి ఎర్రబెల్లి రాక

కొడకండ్ల, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీ క్లస్టర్ వారీగా శుక్రవారం నిర్వహించే సమావేశానికి రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరుకానున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సిందే రామోజీ తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

బీరప్ప పండుగకు రావాలని ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వానం

ఎమ్మెల్యే పల్లాను ఆహ్వానిస్తున్న గిరి

బచ్చన్నపేట, ఏప్రిల్ 18 : మండలంలోని కేశిరెడ్డిపల్లిలో ఈ నెల 27 నుంచి జరుగనున్న బీరప్ప పండుగకు రావాలని గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని జనగామలోని ఆయన స్వగృహంలో తెలంగాణ టైలర్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గాలి తిరుపతితో కలిసి కురుమ సంఘం యూత్ నేత గిరి కలిసి ఆహ్వానం పలికారు. బీరప్ప పండుగను 35 ఏండ్లకోసారి చేసుకుంటామని తప్పకుండా రావాలని కోరగా వస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. గ్రామంలో వారం రోజుల పాటు బీరప్ప జాతర ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రమేశ్‌యాదవ్

వడదెబ్బతో రైతు మృతి

మల్లయ్య (ఫైల్)

రఘునాథపల్లి ఏప్రిల్ 18 : వడదెబ్బకు గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని జాఫర్ గూడెంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏదునూరి మల్లయ్య(72) ఈ నెల 17న తన వ్యవసాయ బావి దగ్గర పనులు చేస్తుండగా వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గుర్తించి, వెంటనే జనగామ ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, మల్లయ్య మృతదేహాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేశ్ యాదవ్ సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జోగు శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఈరెంటి వంశీ(ఫైల్)

పాలకుర్తి రూరల్, ఏప్రిల్ 18 : ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై ఎం సాయి ప్రసన్నకుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఈరెంటి వంశీ(20) గత ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో ఏడాది కాలంగా ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. ఈ ఏడాది కూడా పరీక్షలు రాశాడు. అయితే, పాస్ అవుతానో లేదో అనే అనుమానంతో వంశీ గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఈరెంటి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మల్లయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్ సతీశ్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు పరామర్శ

బచ్చన్నపేట, ఏప్రిల్ 18 : మండలం కొడవటూరు గ్రామంలో ఇటీవల నడిగొట్లు మల్లయ్య, మేక ఎర్రబీరుమల్లయ్య, ఆత్కూరి మల్లమ్మ, ముక్కెర అయిలయ్య మృతిచెందగా బాధిత కుటుంబాలను గురువారం గ్రామ మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆ